

# నేటి నిజం

తెలుగు దినపత్రిక




website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 18-7-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 287 | పేజీలు: 4 | వెల: రూ.1/-


## మధ్యవర్తిత్వంతో ప్రజలకు మేలు: జస్టిస్ ఎన్వీ రమణ



హైదరాబాద్ , జులై 17:మధ్యవర్తిత్వం అనేది తక్కువ ఖర్చుతో కూడుకున్నదని.. దీని వల్ల సామాన్య ప్రజలకు మేలు కలుగుతుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. అయితే వివాద పరిష్కారాల్లో రాజ్యాంగ సమానత్వం ఉండాలని తెలిపారు. . ఇండియా–సింగపూర్? మీడియేషన్? సమ్మిట్?లో పాల్గొన్న ఆయన? మధ్యవర్తులు సలహాదారుడిగా మారడం మంచి పరిణామం కాదన్నారు. మధ్యవర్తులకు శిక్షణ ఇస్తే సాధారణ ప్రజానీకానికి మేలు జరుగుతుందన్నారు. మీడియేషన్ అనేది తక్కువ ఖర్చుతో కూడుకున్నదని.. మధ్యతరగతి ప్రజలకు న్యాయం జరిగేందుకు ఇది సులభమైన మార్గమని చెప్పారు. అయితే మధ్యవర్తులు.. మంచి గుణం, నైతికత, పారదర్శకత, తటస్థత వంటి లక్షణాలను కలిగి ఉండాలని జస్టిస్ ఎన్వీ రమణ సూచించారు.

## థర్డ్ వేవ్ వచ్చేసింది.. ప్రైమరీ స్టేజ్‌లో ఉన్నాం: డబ్ల్యుహెచ్ఓ

న్యూఢిల్లీ, జులై 17:ప్రపంచ ఆరోగ్య సంస్థ చీఫ్ టెడ్రోస్ అథనమ్ గేబ్రియాసిస్ పిడుగు లాంటి వార్త చెప్పారు. కరోనా సెకండ్ వేవ్ ఇప్పుడిప్పుడే తగ్గుతున్న తరుణంలో? ప్రపంచవ్యాప్తంగా థర్డ్ వేవ్ తొలి దశలో ఉన్నట్లు ఆయన హెచ్చరించారు. దురదృష్ట వశాత్తూ మనమంతా ప్రస్తుతం కోవిడ్ మూడవ వేవ్ ప్రారంభ దశలో ఉన్నామని టెడ్రోస్ తెలిపారు. జెనీవాలో జరిగిన ఓ సమావేశంలో ప్రపంచ వ్యాప్తంగా ప్రజల్లో సామాజిక చైతన్యం పెరిగినప్పటికీ డెల్టా వేరియెంట్ వేగంగా వ్యాప్తి చెందుతుండడం, కేసుల సంఖ్య పెరుగుతుండడం ఆందోళనను కలిగిస్తుందని ఆయన చెప్పారు. కరోనా వైరస్ వేగంగా మారుతుందని, దీంతో వైరస్ మరింత వేగంగా వ్యాప్తి చెందుతుందని వెల్లడించారు. డెల్టా వేరియంట్ ఇప్పుడు 111 కి పైగా దేశాలలో ఉందని, దీన్ని వీలైనంత త్వరగా అంతం చేయాలని, లేదంటే విపరీతమైన పరిణామాలు ఏర్పడేందుకు అవకాశం ఉంటుందన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా వరుసగా నాలుగో వారం కూడా రోజువారీగా నమోదవుతున్న కోవిడ్ కేసుల సంఖ్య పెరుగుతోంది. ఇది ఆందోళన కలిగించే విషయమన్నారు. వ్యాక్సిన్ల పంపిణీలో తీవ్ర అసమానతలు ఉన్నాయని, కేవలం సంపన్న దేశాలు ఎక్కువ టీకాలను పొందాయని టెడ్రోస్ తెలిపారు. ఇప్పటికీ ఇంకా అనేక దేశాలకు టీకాలు అసలు చేరలేదని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలకు సమానంగా వ్యాక్సినేషన్ కార్యక్రమం కొనసాగితే కరోనా కట్టడి సాధ్యమవుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ పదే పదే చెబుతోందని ఆయన గుర్తు చేశారు.

# డయల్ ఏ సెప్టిక్ ట్యాంకర్లు ప్రారంభం..







హైదరాబాద్ , జులై 17: స్వచ్ఛ హైదరాబాద్ దిశగా మరో ముందడుగు పడింది. నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు జలమండలి ప్రయత్నిస్తోంది. క్రమంలో భాగంగా డయల్ ఏ సెప్టిక్ ట్యాంకర్లను ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ వాహనాల కోసం టోల్ ఫ్రీ నంబర్ 155313కు డయల్ చేయొచ్చు.

డయల్ ఏ సెప్టిక్ ట్యాంకర్ల ప్రారంభం.. టోల్ ఫ్రీ నంబర్ 155313

ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. డయల్ ఏ సెప్టిక్ ట్యాంక్ పేరుతో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అభినందించదగ్గ విషయమన్నారు. నాగరికమైన పద్ధతుల్లో పట్టణాల్లో ప్రజలు జీవించాలి.

పరిశుభ్రమైన వాతావరణంలో మన పిల్లలు ఉండాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుంది. మానవ వ్యర్థాలను సరైన పద్ధతిలో శుద్ధి చేయకపోతే రోగాలు వచ్చే అవకాశం ఉంది. ఆ వ్యర్థాలను శాస్త్రీయమైన పద్దతుల్లో శుద్ధి చేయాలన్నారు.

నాలాల క్లీనింగ్ కోసం కొత్త వాహనాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని చెరువులు, కాల్వల్లో మానవ వ్యర్థాలు కలవకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దేశంలోనే ఇది అతిపెద్ద ప్రయత్నమన్నారు.

వినూత్న ఆలోచనలు అమలు చేస్తూ క్లీన్ హైదరాబాద్ కోసం పాటుపడుతున్నామని కేటీఆర్ తెలిపారు. మిగతా నగరాలకు హైదరాబాద్ ఆదర్శంగా నిలిచిందన్నారు. 71 చోట్ల ఎఫ్ఎస్టీపీలను నిర్మిస్తున్నాం. త్వరలో మరో 68 నిర్మిస్తామని ప్రకటించారు. ఈ నూతన వాహనాల్లో పరిమితమైన ఛార్జీలతో మానవ వ్యర్థాలను తరలిస్తారని, పేద ప్రజలు ఉండే చోట తక్కువ ఛార్జీలను నిర్ణయించామని కేటీఆర్ తెలిపారు.

## మరో 66కోట్ల కొవిడ్ టీకా డోసులకు కేంద్రం ఆర్డర్!

న్యూఢిల్లీ, జులై 17:ఈ ఏడాది ఆగస్ట్, డిసెంబర్ మధ్య 66 కోట్ల మోతాదుల కొవిడ్ టీకాలు సరఫరా చేయాలని కేంద్ర ప్రభుత్వం దేశీయ టీకాల తయారీదారులను ఆదేశించింది. సవరించిన ధరల మేరకు డోసుకు కోవిషీల్డ్‌కు రూ.205, కొవాగ్జిన్‌కు రూ.215 చొప్పున చెల్లించనుంది. సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా నుంచి 37.5 కోట్ల కోవిషీల్డ్, భారత్ బయోటెక్ నుంచి 28.5కోట్ల కొవాగ్జిన్ టీకాలను కేంద్రం డిసెంబర్ నాటికి కొనుగోలు చేస్తుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. రెండు కంపెనీలు కలిసి 66 కోట్ల మోతాదులను ఆగస్ట్, డిసెంబర్ మధ్య సరఫరా చేయాలని ఉంటుందని, పన్నులన్నీ మినహాయించి రెండు టీకాలకు రూ.205, రూ.215 చెల్లించనున్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

రెండు టీకాలను రూ.150 చొప్పున సేకరిస్తున్న కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖ జూన్ 21 నుంచి కొత్త వ్యాక్సిన్ సేకరణ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చిన తర్వాత ధరలను సవరించాలని సూచించింది. ఈ నూతన విధానం ప్రకారం.. కొత్త విధానంలో దేశంలోని ఔషధ తయారీదారులు ఉత్పత్తి చేస్తున్న వ్యాక్సిన్లలో 75శాతం మంత్రిత్వ శాఖ సేకరించనుంది. వ్యాక్సిన్ తయారీ సంస్థలను తమ ఉత్పత్తులు పెంచాలని కేంద్రం కోరింది. అయితే, తయారీదారులు ప్రతి మోతాదుకు రూ.150 చెల్లిస్తే పెట్టుబడులు పెట్టడం ఆచరణీయం కాదని పేర్కొన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపారు. ఈ ప్రక్రియను వికేంద్రీకరించాలని డిమాండ్ చేసిన నేపథ్యంలో 50శాతం వ్యాక్సిన్లను సేకరించడానికి కేంద్రం గతంలో రాష్ట్రాలు, ప్రైవేటు ఆసుపత్రులకు అనుమతి ఇచ్చింది.అయితే, నిధులతో సహా సేకరణపై రాష్ట్రాలకు సమస్యలు ఉత్పన్నమవగా.. కేంద్రమే సేకరించి, రాష్ట్రాలకు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్లు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రధాని మోదీ టీకా మార్గదర్శకాల సవరణను జూన్ 8న ప్రకటించారు. ఇందులో వ్యాక్సిన్ తయారీ కంపెనీలు తమ ఉత్పత్తుల్లో 25శాతం ప్రైవేటు ఆసుపత్రులకు విక్రయించుకునేందుకు అవకాశం ఇచ్చింది. జూన్ 21 నుంచి అమలులోకి వచ్చిన సవరించిన మార్గదర్శకాల ప్రకారం.. రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వం 18 నిండిన వారందరికీ ఉచితంగా టీకాలు సరఫరా చేస్తున్నది. ఇదిలా ఉండగా దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు వ్యాక్సిన్ డ్రైవ్‌లో 41.69 కోట్ల మోతాదులకుపైగా టీకాలు పంపిణీ చేసినట్లు కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖ తెలిపింది.

## సినీ ఎగ్జిబిటర్ల సమస్యల పరిష్కారానికి కృషి : మంత్రి తలసాని



హైదరాబాద్ , జులై 17:సినీ ఎగ్జిబిటర్స్ సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు.

శనివారం తెలంగాణా స్టేట్ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు మాసాబ్ ట్యాంక్‌లోని మంత్రి కార్యాలయంలో ఆయనను కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

కరోనా కారణంగా ఏడాదిగా సినిమా థియేటర్లు మూసి ఉండటంతో సినీ ఎగ్జిబిటర్లు, థియేటర్ల నిర్వాహకులు ఆర్థికంగా నష్టపోయామని ప్రభుత్వం తరఫున అండగా నిలిచి ఆదుకోవాలని కోరారు.

సినిమా థియేటర్లు మూతపడిన సమయంలో ప్రాపర్టీ ట్యాక్స్ మినహాయించాలని, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో వాహనాల పార్కింగ్ చార్జీ వసూలుకు వెసులుబాటు కల్పించాలి. ఎస్‌జీఎస్‌టీ ట్యాక్స్ రద్దు చేయాలి. జీఓ 75ను పునరుద్దరించాలని, షూటింగ్ అనుమతులకు వసూలు చేసే చార్జీలను తగ్గించేలా చూడాలని మంతి కోరారు. స్పందించిన ఆయన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో సునీల్ నారంగ్, అనుపమ్ రెడ్డి, అభిషేక్ నామా, సదానంద్ గౌడ్, బాల గోవింద్ రాజ్ తాడ్ల తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టీఎస్ఎఫ్‌డీసీ ఈడీ కిషోర్ బాబు ఉన్నారు

## దక్షిణాఫ్రికాలోని మనవాళ్లంతా క్షేమం : గుర్రాల నాగరాజు

జోహన్స్‌బర్గ్, జులై 17:: దక్షిణాఫ్రికాలోని తెలుగువారంతా క్షేమంగా ఉన్నట్లు టీఆర్ఎస్ ఎన్నారై శాఖ అధ్యక్షులు గుర్రాల నాగరాజు తెలిపారు. దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు జాకబ్ జుమా జైలుకు వెళ్లడంతో మొదలైన ఆందోళనలు తీవ్రరూపం దాల్చి అల్లర్లు, దోపిడీలకు దారితీశాయి. ప్రజలు, నిరసనకారులు ఆహారం, వస్త్ర దుకాణాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, మద్యం, షాపింగ్ మాల్స్‌పై దాడి చేసి లూటీ చేస్తున్నారు. ఈ క్రమంలో ముఖ్యంగా ముఖ్యంగా గౌటెంగ్, క్వాజులు– నాటల్ ప్రావిన్సుల్లో చోటుచేసుకున్న ఘర్షణలు, హింసాత్మక ఘటనలు, తొక్కిసలాటలో సుమారు 200 మంది చనిపోయారు. ప్రవాసుల క్షేమంపై ఆందోళనలు వ్యక్తమౌతున్న నేపథ్యంలో గుర్రాల నాగరాజు అక్కడి పరిస్థితిని తెలియజేశారు.

అధ్యక్షుడి నిన్నటి ప్రసంగం తర్వాత పరిస్థితులు సద్దుమనుగుతాయి అనుకున్నాం. కానీ దర్బన్‌లో హింసాత్మక సంఘటనలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. మిలటరీ రంగంలోకి దిగినా చాలా చోట్ల చెదురుమదురు సంఘటనలు జరుగుతున్నాయన్నారు. తెలుగు వారంతా ఎక్కువగా జోహన్స్‌బర్గ్‌లో ఉంటారని వారంతా క్షేమంగానే ఉన్నట్లు ఆయన వెల్లడించారు. ఎలాంటి ఇబ్బంది లేదని రాబోయే రెండు మూడు రోజుల్లో ప్రశాంత వాతావరణం నెలకొంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## పచ్చదనం పెంపొందించేందుకే ప్రకృతి వనాలు : మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్ , జులై 17: రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచాలనే లక్ష్యంతో పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల్లో ప్రకృతి వనాలు, మండల కేంద్రాల్లో బృహత్ ప్రకృతి వనాలను ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు. రాష్ట్రంలో రూ.116 కోట్ల వ్యయంతో 19,472 పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశామని, వీటిలో 19,413 (99.9%) పూర్తి చేశామని ఆయన తెలిపారు. ప్రగతిలోని 59 వనాలను పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.

"పల్లె ప్రకృతి వనాలకు మంచి స్పందన రావడంతో మండలానికి ఒకటి చొప్పున బృహత్ పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. మండల కేంద్రంలో భూమి లేనిచోట మేజర్ పంచాయతీలో పది ఎకరాల స్థలంలో బృహత్ పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేయనున్నాం. ఒక్కొక్క ప్రకృతి వనం ఏర్పాటుకు రూ. 40 లక్షలు ఖర్చు చేయనున్నాం. వీటిలో 31 వేల మొక్కలను పెంచుతాం. ఇందుకోసం ఇప్పటివరకు 535 మండలాల్లో ఐదు వేల 300 ఎకరాల భూమిని గుర్తించాం. మిగతా పది మండలాల్లో భూమి ఎంపిక వెంటనే పూర్తి చేస్తాం. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. పల్లె ప్రగతి, హరితహారం కార్యక్రమాల అమలుతో గ్రామాల్లో పచ్చదనం పరిఢవిల్లుతున్నది" అని మంత్రి ఎర్రబెల్లి అన్నారు.

## భారత్ సార్వభౌమాధికారాన్ని ప్రశ్నిస్తే దీటుగా బదులిస్తాం : అమిత్ షా

న్యూఢిల్లీ : పారామిలటరీ బలగాలు ఎన్నోసవాళ్లు ఎదుర్కొంటూ అహరహం శ్రమిస్తున్నాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశంసించారు.

శనివారం బీఎస్ఎఫ్ ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సరిహద్దు భద్రత జాతీయ భద్రతని ఎన్నో సవాళ్ల నడుమ జవాన్ల సేవలు అసామాన్యమైనవని కొనియాడారు.

మన పారామిలటరీ బలగాల పట్ల తాను పూర్తి విశ్వాసంతో ఉన్నానని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో మనకు స్వతంత్ర రక్షణ విధానం ఉందని మన సార్వభౌమత్వాన్ని సవాల్ చేసే శక్తులకు అదే భాషలో దీటుగా బదులిస్తామని అమిత్ షా పేర్కొన్నారు.

ప్రపంచ పటంలో భారత్ తన స్థానాన్ని పటిష్టం చేసుకుంటోందని అన్నారు. అసమాన త్యాగం చేసిన సైనికులకు తాను సెల్యూట్ చేస్తున్నానని చెప్పారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన పోరాట యోధులను దేశం మరిచిపోదని అన్నారు.

మన సరిహద్దులను కాపాడుతున్న పారామిలటరీ బలగాలు, బీఎస్ఎఫ్ దళాలతో ప్రపంచ పటంలో మనకు సముచిత స్థానం దక్కిందని అన్నారు.

## అరకులో విషాదం.. ముగ్గురు చిన్నారులు సహా తల్లి మృతి



విశాఖపట్నం, జులై 17:: ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో విషాదం చోటుచేసుకుంది. అరకులోయలో ముగ్గురు చిన్నారులు సహా తల్లి అనుమానస్పద స్థితిలో మృతిచెందింది.

పిల్లలకు పురుగుమందు తాగించిన తల్లి, అనంతరం తాను కూడా ఉరేసుకుని మృతిచెందింది.

అరకులోయలో మండలం సిమిలిగూడకు చెందిన సురేఖ, శెట్టి సంజీవ్ భార్యా భర్తలు. వారికి కూతురు సుశాన, ఇద్దరు కుమారులు షర్విన్, సిరిల్ ఉన్నారు. కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి.

ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి సురేఖ ఇంట్లో ఉరికి వేలాడుతున్న స్థితిలో స్థానికులు గుర్తించారు. అదేవిధంగా మంచంపై విగత జీవులుగా పడి ఉన్న పిల్లలను దవాఖానకు తరలించారు. అయితే అప్పటికే ముగ్గురు చిన్నారులు మృతిచెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### చరిత్రలో నేటినిజం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం



మోజులలో? ఫోజులలో
బ్రాజిల్లెడి శ్వేత తెరపై నటియించుచున్
"రాజేష్ఖన్నా" సతతము
రాజిల్లను మనమునందు రసికావళికిన్

( జులై 18 హీరో రాజేష్‌ఖన్నా జయంతి..)

–రాధశ్రీ

సెల్: 9494481210



నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

## 'సెంట్రల్ విస్టాలోనే వచ్చే ఏడాది రిపబ్లిక్ డే పరేడ్'

న్యూఢిల్లీ, జులై 17: రాష్ట్రపతి భవన్ నుంచి ఇండియా గేట్ వరకు విస్తరించిన సెంట్రల్ విస్టా అవెన్యూ పునరాభివృద్ధి పనులు ఈ నవంబర్ నాటికి పూర్తవుతాయని, వచ్చే ఏడాది రిపబ్లిక్ డే పరేడ్ వేడుకలు పునరుద్ధరించిన రాజ్‌పథ్‌లో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. కేంద్ర హౌసింగ్, పట్టణ వ్యవహారాలశాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరీ పనుల పగ్రతిపై గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి, మంత్రిత్వ శాఖ అధికారులు, సీపీడబ్ల్యూడీ, కాంట్రాక్టర్, ఆర్కిటెక్ట్ బిమాల్ పటేల్‌తో సమీక్షించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు.

రాజ్‌పథ్ పునరాభివృద్ధి ప్రాజెక్టులో పెద్ద ఎత్తున రాతిపని, అండర్‌పాస్‌ల నిర్మాణం, భూగర్భ సౌకర్యాల బ్లాక్‌లు, ఉద్యానవన పనులు, పార్కింగ్‌కు తగినంత స్థలం ఉందని మంత్రిత్వశాఖ అధికారి ఒకరు తెలిపారు. కృత్రిమ చెరువులపై 12 వంతెనలు నిర్మిస్తున్నారని, రాజ్‌పథ్‌ను సందర్శించే ప్రజలకు అద్భుతమైన అనుభూతి లభిస్తుందని పేర్కొన్నారు. సెంట్రల్ విస్టా అవెన్యూ పునరాభివృద్ధి నవంబర్ నాటికి పూర్తవుతుందని, వచ్చే ఏడాది రిప్లబిక్ డే పరేడ్ కొత్తగా అభివృద్ధి చెందిన రాజ్‌పథ్‌లో జరుగుతుందని అధికారి వివరించారు.


TURAGA FOUNDATION
सह वीर्यं करवावहै

### తురగా ఫౌండేషన్

బాలచెలిమి పిల్లల పత్రిక

సంయుక్త ఆధ్వర్యంలో

### తురగా జానకీరాణి పిల్లల కథల పోటీలు

పిల్లల కోసం కథలు
చిట్టి కథలు, చిన్ని కథలు

పిల్లలని, పిట్టలని,
కబుర్లని, కథలని ప్రేమించేవారు
ఎవరైనా హాయిగా కథ రాసి
మాకు పంపవచ్చును

మొదటి బహుమతి: 10000 రూపాయలు
రెండో బహుమతి: 7000 రూపాయలు
మూడో బహుమతి: 5000 రూపాయలు
ప్రోత్సాహక బహుమతులు: Rs 2000 X 3

కథలు పంపవలసిన చిరునామా:
turagafoundation2021@gmail.com
or
#29, Journalists' Colony
Road # 3, Banjara Hills
Hyderabad - 500034

Ph: 98484 29169
92461 03119



చివరి తేదీ: జులై 31, 2021



అంశం ఏదైనా మీ ఇష్టం. టైపులో 3 పేజీలు, చేతి రాతలో 5 పేజీలు మించకుండా

# జీహెచ్ఎంసీ వద్ద కుటుంబం ఆత్మహత్యాయత్నం

న్యూఢిల్లీ, జులై 17:జీహెచ్ఎంసీ ఎదుట ఓ కుటుంబం ఆత్మహత్యకు యత్నించింది. అబిడ్స్ సర్కిల్ 14 లో గత పదిహేనేళ్ళగా శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ గా రమేష్ యాదవ్ పని చేస్తున్నాడు. అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ ఉమ గౌరీ ప్రతి నెల డబ్బులు ఇవ్వాలని వేధించేదని వాపోయాడు. తాను డబ్బులు ఇవ్వలేనని చెప్పడంతో ఉద్యోగం నుంచి తొలగించారని ఔట్ సోర్సింగ్ ఉద్యోగి రమేష్ ఆవేదన వ్యక్తం చేశాడు. అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ వేధింపులు, ఉద్యోగం నుంచి తొలగించడంతో జీహెచ్ఎంసీ ఎదుట రమేష్ కుటుంబం పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. అయితే, సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకోవడంతో ప్రమాదం తప్పింది.

# పోలీసులతో ఉద్యమాలను ఆపలేరు: సీపీఐ



న్యూఢిల్లీ, జులై 17:సీఎం జగన్ పై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. పోలీసులను అడ్డం పెట్టుకుని ఎక్కువ కాలం ఉద్యమాలను ఆపలేరని రామకృష్ణ అన్నారు. 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న సీఎం జగన్? జాబ్ లెస్ క్యాలెండర్ ప్రకటిస్తే ప్రశ్నించకూడదా? అని ప్రశ్నించారు. 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని సీఎం జగన్ ఇచ్చిన హామీ ఏమైందని నిలదీశారు. ప్రభుత్వ శాఖల్లో 30 శాతం ఖాళీలు ఉన్నాయని ఆర్థిక శాఖ ప్రకటించిందని తెలిపారు. సోమవారం సీఎం జగన్ నివాసం ముట్టడికి సీపీఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందని రామకృష్ణ ప్రకటించారు. ఇంటి ము

# యూజీసీ అకడమిక్ క్యాలెండర్ విడుదల

న్యూఢిల్లీ, జులై 17: ప్రస్తుత విద్యాసంవత్సరానికిగాను అకడమిక్ క్యాలెండర్‌ను యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) విడుదల చేసింది. ఈ క్యాలెండర్ ప్రకారం అన్ని యూనివర్శిటీలు, కాలేజీల్లో ప్రవేశాలు ఆగస్ట్ ఒకటి నుంచి ప్రారంభమవుతాయి. అక్టోబర్ 1 నుంచి కొత్త సెషన్ మొదలవుతుంది. ప్రస్తుత కొవిడ్-19 మహమ్మారి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని 2021-22 విద్యా సంవత్సరంలో కళాశాలలు, విశ్వవిద్యాలయాల పనితీరుకు సంబంధించి యూజీసీ ఇటీవల కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. అన్ని విశ్వవిద్యాలయాలు 2021 సెప్టెంబర్ 30 లోగా ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేయాలని అకడమిక్ క్యాలెండర్‌లో ఆదేశించారు. ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయడానికి అక్టోబర్ 31 వరకు సమయం ఇచ్చారు. ఏదేని కారణాల వల్ల 12 తరగతి బోర్డు ఫలితం ఆలస్యం అయితే, అక్టోబర్ 18 నుంచి కొత్త సెషన్ ప్రారంభించవచ్చునని తన మార్గదర్శకాల్లో యూజీసీ పేర్కొన్నది.

అధికారిక నోటీసు ప్రకారం, "టెర్మినల్ సెమిస్టర్ / ఫైనల్ ఇయర్ పరీక్షలు (2020-2021) తప్పనిసరిగా ఆఫ్‌లైన్ (పెన్ ఒ పేపర్) / ఆన్‌లైన్ / బ్లెండెడ్ (ఆన్‌లైన్ + ఆఫ్‌లైన్) మోడ్‌లో 2021 ఆగస్టు 31 లోపు నిర్వహించాల్సి ఉంటుంది." కరోనా ఇన్‌ఫెక్షన్ దృష్ట్యా అక్టోబర్ 31 వరకు ప్రవేశాలను రద్దు చేసిన విద్యార్థుల నుంచి విశ్వవిద్యాలయం రద్దు ఫీజు వసూలు చేయకూడదు. డిసెంబర్ 31 వరకు ప్రవేశాన్ని రద్దు చేసిన విద్యార్థికి ప్రాసెసింగ్ ఫీజు గరిష్టంగా రూ.1000 వసూలు చేయవచ్చు. సెషన్ ఆన్‌లైన్‌లో లేదా ఆఫ్‌లైన్‌లో నడుస్తుందో లేదో నిర్ణయాధికారం యూజీసీ ఆయా రాష్ట్రాలకు వదిలివేసింది. విద్యాసంస్థల క్యాలెండర్, మార్గదర్శకాలను ఎన్ఐసీటీఈ, ఎన్‌సీటీఈ, బీసీఐ, ఎన్ఎంసీ, డీసీఐ, ఎన్ఐసీ, పీసీఐ, ఆయుష్ వంటి విద్యాసంస్థలతో సంప్రదించిన తర్వాత జారీ చేశారు. ఇలాఉండగా, హిమాచల్‌ప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో 12 వ తరగతి ఫలితాలు ఇప్పటికే విడుదలవ్వగా, మరికొన్ని రాష్ట్రాల్లో ఈ నెలాఖరుకు విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి. జూలై 31 లో బోర్డ్ ఫలితాలను అన్ని రాష్ట్రాలు విడుదల చేస్తాయనే భరోసాతో ఉన్నట్లు యూజీసీ తెలిపింది.

# నేడు పాలిసెట్ ఎంట్రెన్స్ టెస్ట్

హైదరాబాద్ , జులై 17:డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం పాలిసెట్-2021 పరీక్ష మరికొద్ది సేపట్లో ప్రారంభంకానుంది. ఆఫ్‌లైన్‌లో జరుగుతున్న ఈ పరీక్షను శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నారు. ఈ ప్రవేశపరీక్ష కోసం రాష్ట్రవ్యాప్తంగా 411 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది 1,02,496 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఉదయం 10 గంటల నుంచి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తామని అధికారులు వెల్లడించారు. 11 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ఎస్‌బీటీఈటీ యాప్ ద్వారా పరీక్ష కేంద్రం లొకేషన్‌ను తెలుసుకునే అవకాశం కల్పించారు. కరోనా సోకినవారికి సమీప దవాఖానల్లో ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నారు

# రూ.2 లక్షలను కొరికేసిన ఎలుకలు

హైదరాబాద్ , జులై 17:వైద్యం కోసం దాచుకున్న డబ్బులను ఎలుకలు పటపట కొరికేశాయి. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లాలోని వేమునూరు గ్రామపంచాయతీ పరిధిలోని ఇందిరానగర్ తండాలో చోటు చేసుకుంది. భూక్య రెడ్యా అనే వ్యక్తి కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇలా సంపాదించిన రూ.2 లక్షల రూపాయలను ఇంట్లో దాచి పెట్టాడు. అయితే రూ.500 నోట్ల కట్టలను ఎలుకలు కొరికి పడేశాయి. ఆ నోట్లను చూసి రెడ్యా బోరున విలపించాడు. దాంతో బాధితుడు రెడ్యా చిరిగిన నోట్లతో బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నాడు. ఆ నోట్లు చెల్లుబాటు కావని బ్యాంకు సిబ్బంది చెప్పడంతో బాధితుడి ఆవేదన చెందుతున్నాడు.



# ఇంధన పరివర్తన రంగంలో ప్రపంచంలో అగ్రగామి దేశంగా భారత్ .. కేంద్ర ఇంధన శాఖ మంత్రి శ్రీ ఆర్ కె సింగ్

న్యూఢిల్లీ, జులై 17:ఇంధన పరివర్తన రంగంలో భారతదేశం ప్రపంచంలో ముందున్నదని కేంద్ర విద్యుత్, కొత్త మరియు పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి శ్రీ ఆర్ కె సింగ్ అన్నారు. ' ఆత్మ నిర్భర్ భరత్-పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిలో స్వయం సమృద్ధి అనే అంశంపై భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి ప్రసంగించారు. ప్రపంచంలో పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సామర్థ్యాన్ని అత్యంత వేగంగా అభివృద్ధి చేసుకుంటున్న దేశంగా భారతదేశం గుర్తింపు పొందిందని ఆయన చెప్పారు.

పారిస్ లో జరిగిన కాప్-21 సమావేశంలో అంగీకరించిన విధంగా 2030 నాటికి విద్యుత్ ఉత్పత్తిలో 40% ఉత్పత్తిని శిలాజ రహిత ఇంధన వనరులను వినియోగించి చేయాలన్న ఒప్పందానికి భారత్ కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. ఇప్పటికే 38.5% విద్యుత్ ను శిలాజ రహిత ఇంధన వనరులను వినియోగించి చేస్తున్నామని, సామర్థ్య పెంపుదలకు అమలు చేస్తున్న పథకాలను పరిగణనలోకి తీసుకుంటే ఇది 48. 5%గా ఉంటుందని మంత్రి వివరించారు. 2030 నాటికి పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని 450 గిగా వాట్లకి పెంచి ఈ రంగంలో ప్రపంచంలో అగ్రగామిగా కొనసాగాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని శ్రీ సింగ్ అన్నారు.

దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామజ్యోతి యోజన పథకం కింద ప్రతి గ్రామాన్ని, ప్రతి కుగ్రామాన్ని అనుసంధానించామని,, సౌభాగ్య పథకం కింద ప్రతి ఇంటిని అనుసంధానించడం ద్వారా భారతదేశం అందరికి విద్యుత్ అందించడంలో విజయం సాధించిందని మంత్రి పేర్కొన్నారు. ప్రపంచంలో అత్యంత వేగంగా సాగిన అతి భారీ పథకం ఇదేనని మంత్రి వివరించారు. ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని అన్నారు.

కోవిడ్-19 ప్రభావం ఉన్నప్పటికీ దేశంలో విద్యుత్ డిమాండ్ 200 గిగా వాట్లకు చేరుకున్నదని శ్రీ సింగ్ తెలిపారు. కోవిడ్ ప్రభావం లేని సమయంలో కూడా విద్యుత్ కు ఇంత డిమాండ్ లేదని వివరించిన మంత్రి ఈ డిమాండ్ మరింత పెరుగుతుందని భావిస్తున్నామని అన్నారు. దీనివల్ల పునరుత్పాదక శక్తి సామర్థ్యాన్ని పెంచుకోవడానికి అవకాశం కలుగుతుందని అన్నారు.

సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి అమలు చేస్తున్న కార్యక్రమాల వల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయని శ్రీ సింగ్ అన్నారు. ఈ కార్యక్రమాల ఫలితాలు దేశానికి ప్రయోజనం కలిగించాలన్న లక్ష్యంతో ఆత్మ నిర్భర్ భారత్ ను అమలు చేస్తున్నామని తెలిపారు. భారత పరిశ్రమలను దెబ్బ తీయాలన్న ఉద్దేశంతో కొన్ని దేశాలు అతి తక్కువ ధరలకు సౌర ఘటాలు, మాడ్యూళ్ళను అందుబాటులోకి తీసుకుని వస్తున్నాయని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని భారత పరిశ్రమలను రక్షించాలన్న లక్ష్యంతో సౌర ఘటాలు, మాడ్యూళ్ళపై కస్టమ్స్ సుంకాన్ని విధించాలని నిర్ణయించామని మంత్రి వెల్లడించారు.

అనుమతి పొందిన నమూనాలు, ఉత్పత్తిదారుల జాబితా వల్ల కూడా స్వదేశీ పరిశ్రమలకు రక్షణ కలుగుతుందని శ్రీ సింగ్ పేర్కొన్నారు.

గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ అమోనియా రంగాల్లో కూడా ప్రపంచంలో భారత్ అగ్ర స్థానంలో ఉంటుందని శ్రీ సింగ్ అన్నారు.

దిగుమతి చేసుకున్న సహజ వాయువు నుంచి ఉత్పత్తి గ్రే హైడ్రోజన్ స్థానంలో గ్రీన్ హైడ్రోజన్ ను వినియోగించాలని పరిశ్రమలకు సూచిస్తున్నామని శ్రీ సింగ్ తెలిపారు. దీనికోసం పెట్రోలియం, ఎరువుల లాంటి రంగాలు గ్రీన్ హైడ్రోజన్ కొనుగోలు ఒప్పందాలను కుదుర్చుకుంటాయని ఆయన వివరించారు. దీనివల్ల స్వదేశంలో ఉత్పత్తి అవుతున్న సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి పరికరాలకు డిమాండ్ పెరగడమే కాకుండా నిల్వ సామర్థ్యం కూడా పెరుగుతుందని అన్నారు.

తమ అవసరాలకు గ్రీన్ ఎనర్జీ ని వినియోగించడానికి ముందుకు వచ్చే పరిశ్రమలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం త్వరలో నియమ నిబంధనలకు రూపకల్పన చేస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. ఇటువంటి పరిశ్రమలు స్వయంగా లేదా ఇతరుల సహకారంతో ఇంధన ఉత్పత్తి సౌకర్యాలను నెలకొల్పుకునే దానిద్వారా తమ ఇంధన అవసరాలను తీర్చుకోవడానికి వీలుంటుందని శ్రీ సింగ్ అన్నారు. దీనిపై అనవసరమైన సర్‌చార్జ్,లెవీలు ఉండవని మంత్రి హామీ ఇచ్చారు.

# మోదీతో పవార్ చర్చించిన అంశాలేంటి?



న్యూఢిల్లీ, జులై 17:మరో రెండు రోజుల్లో పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న వేళ.. దేశ రాజధానిలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సిపి) చీఫ్ శరద్ పవార్ ప్రధాని నరేంద్ర మోడీతో నివాసంలో సమావేశమయ్యారు.

దాదాపు 50 నిమిషాల పాటు వీరి సమావేశం జరిగింది. ఇటీవల రాహుల్ గాంధీ, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ తో భేటీ అనంతరం శరద్ పవార్ ప్రధాని మోదీతో సమావేశం కావడంతో రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత ఏర్పడింది.

ప్రధాని నరేంద్రమోడీతో శరద్ పవార్ భేటీలో ఏయే అంశాలు చర్చకు వచ్చాయన్న అంశంపై వివరాలు బయటికి రాలేదు. అయితే రాష్ట్రపతి పదవికి అభ్యర్థిగా తనకు మద్దతివ్వాలని శరద్ పవార్ పలు పార్టీల్ని కోరుతున్నట్లు తెలుస్తోంది.

ఇప్పటికే రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ తో పాటు పలు బీజేపీయేతర పార్టీల అధినేతలతో ఇప్పటికే భేటీ అయిన పవార్ తన మనసులో మాట చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది.

రాష్ట్రపతి అభ్యర్థిగా తనకు మద్దుతు ఇవ్వాలని కోరినట్లు తెలుస్తోంది.

ఈ విషయంలో బీజేపీయేతర పార్టీల మద్దతు సంపాదించిన పవార్.. కాంగ్రెస్ అధినేత్రి సోనియా, రాహుల్ గాంధీల మద్దతు కూడా కోరినట్లు రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది.

మరోవైపు ఇప్పటికే తన రాష్ట్రపతి అభ్యర్థిత్వానికి సంబంధించి వస్తున్న ఊహాగానాల్ని పవార్ తోసిపుచ్చారు. అయితే, కీలక నేతలతో ఆయన భేటీలు కావడం ఆసక్తిరేపుతోంది.

# కేంద్ర నిర్ణయాన్ని స్వాగతించిన బీజేపీ



న్యూఢిల్లీ, జులై 17:కృష్ణా, గోదావరి నదీ జలాలకు సంబంధించి కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ బోర్డుల పరిధిని ఖరారు చేస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలంగాణ బీజేపీ నాయకురాలు డీకే అరుణ అన్నారు. ఇన్నాళ్లుగా కృష్ణా జలాల్లో వినియోగంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగింది. జగన్ తో కుమ్మక్కైన కేసీఆర్ దక్షిణ తెలంగాణ నోట్లో మట్టి కొట్టారని మండిపడ్డారు. కేఆర్ఎంబీ పరిధి నోటిఫై చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయంతో తెలంగాణకు న్యాయం జరుగుతుందన్నారు. పక్క రాష్ట్రం అక్రమంగా నిర్మిస్తున్న రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్, పోతిరెడ్డిపాడు విస్తరణ వంటి ప్రాజెక్టు పనులను కేఆర్ఎంబీ ఆపేస్తుందన్నారు. కేంద్రం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ పై టీఆర్ఎస్ నేతల విమర్శలు సరికాదన్నారు.

విభజన చట్టం ప్రకారమే రివర్ బోర్డుల పరిధిని కేంద్రం నోటిఫై చేసిందనే విషయాన్ని మర్చిపోవద్దన్నారు. కృష్ణా, గోదావరి బోర్డుల పరిధిని నోటిఫై చేయడంవల్ల తెలంగాణకు ఎట్లాంటి నష్టం జరగదన్నారు. రాష్ట్రానికి రావాల్సిన న్యాయబద్ధమైన నీటి వాటాను కచ్చితంగా వాడుకునే అవకాశం ఉంటుందన్నారు.

అదే విధంగా పక్క రాష్ట్రం అదనంగా తీసుకెళ్తున్న జల దోపిడీకి అడ్డుకట్ట పడుతుందన్నారు. కొత్త ప్రాజెక్టుల నిర్మాణానికి కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ బోర్డులకు ఎట్లాంటి సంబంధం లేదని డీకే అరుణ అన్నారు. సీడబ్ల్యూసీ అప్రూవ్ తీసుకుంటే ఎన్ని ప్రాజెక్టులైనా కట్టుకోవచ్చన్నారు. ఒకవేళ ఇప్పటి వరకు అనుమతి లేని ప్రాజెక్టులేమైనా ఉంటే వాటి డీపీఆర్ లు సమర్పించి 6 నెలల్లోగా అనుమతి తీసుకునే అవకాశం ఉందన్నారు. కేంద్రం తీసుకున్న రివర్ బోర్డుల పరిధి నిర్ణయం తెలంగాణకు మేలు చేసేదేనని అరుణ స్పష్టం చేశారు.

# యడియూరప్ప రాజీనామా ?.. ఢిల్లీలో ఏం జరుగుతోంది?

న్యూఢిల్లీ, జులై 17:కర్ణాటక రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుంది. కర్ణాటక ముఖ్యమంత్రి యడియూరప్ప రాజీనామాకు రంగం సిద్ధమైంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో సీఎం యడియూరప్ప సమావేశం కావడంతో ఆయన సీఎం పదవికి రాజీనామా చేస్తారంటూ ప్రచారం సాగుతోంది. నిన్న ప్రధాని నరేంద్ర మోడీతో కలిసిన సందర్భంగా రాజీనామాకు అంగీకారం తెలిపినట్లు సమాచారం. కరోనా సమయంలోనూ కొంతమంది మంత్రులు, సొంత పార్టీ ఎమ్మెల్యేలు యడియూరప్పను టార్గెట్ చేయడం.. ప్రభుత్వంపై ఆయనపై అసమ్మతి ఎక్కువైంది. ఈ నేపథ్యంలో యడ్డీని సీఎం పదవి నుంచి తప్పించాలని బీజేపీ నాయకత్వం నిర్ణయానికి వచ్చింది.

కర్ణాటక ముఖ్యమంత్రి యడియూరప్పకు పదవీ గండం పట్టుకుందని కొంతకాలంగా ఊహాగానాలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. సొంత పార్టీ ఎమ్మెల్యేలే ఆయనపై అసమ్మతి స్వరం వినిపిస్తుండటంతో యడియూరప్ప రాజీనామా చేయక తప్పదన్న ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో యడియూరప్ప ఢిల్లీ పర్యటనకు వెళ్లడంతో ఆ ప్రచారానికి బలం చేకూర్చింది. శుక్రవారం ప్రధాని మోదీతో భేటీ అయిన యడియూరప్ప రాజీనామా గురించే చర్చించినట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇదే విషయంపై శనివారం కేంద్రమంత్రి అమిత్ షా,బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను కూడా కలిసి చర్చించనున్నట్లు తెలుస్తోంది.మరోవైపు రాజీనామాపై జరుగుతున్న ప్రచారాన్ని సీఎం యడియూరప్ప ఖండించారు. శనివారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన యడ్డీ.. కర్ణాటకలో సాగునీటి ప్రాజెక్టుల విషయంపై చర్చించేందుకు మాత్రమే తాను ఢిల్లీకి వచ్చానని తెలిపారు. ప్రధానితో భేటీలో కర్ణాటక అభివృద్ధిపై చర్చించినట్లు తెలిపారు. తన రాజీనామాపై వస్తున్న వార్తలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు.

# అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఆరూరి రమేష్ శంకుస్థాపన

వరంగల్, జులై 17:: వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని గ్రేటర్ వరంగల్ 55వ డివిజన్ భీమారం ఎస్‌వీఎస్ కాలేజీ వద్ద రూ. 45 లక్షల జనరల్ ఫండ్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే అరూరి రమేష్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా డివిజన్లలో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు. వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని డివిజన్లు విలీన గ్రామాలతో కూడి ఉన్నాయని, విలీన గ్రామాలలో పట్టణ వాతావరణం తీసుకువచ్చే విధంగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జక్కుల రజిత వెంకటేశ్వర్లు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఈ ఏడాది ఖైరతాబాద్ గణేషుడి ఎత్తు 30 అడుగులు



హైదరాబాద్ , జులై 17:రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత ప్రాచుర్యం పొందిన గణేష్ విగ్రహాలలో ఖైరతాబాద్ గణేష్ విగ్రహం ఒకటి. పది రోజుల పాటు కొనసాగే గణేష్ చతుర్థి వేడుకల్లో వేలాది మంది భక్తులు ఖైరతాబాద్ గణేషుడిని దర్శించుకుంటారు. గతేడాది కొవిడ్-19 మహమ్మారి కారణంగా విగ్రహం ఎత్తు 9 అడుగులకే పరిమితం చేయబడింది. అంతకుక్రితం 2019లో 61 అడుగులుగా ఉంది. కాగా ఈ ఏడాది విగ్రహం ఎత్తు పెంచుతూ 30 అడుగులుగా నిర్ధారించారు. 2021 అవతారం ఏకాదశ రుద్ర మహా గణపతి ? లక్ష్మీ దేవి, పార్వతి దేవి దేవతల విగ్రహాలతో కూడి ఉంటుంది. ఈ ఏడాది థీమ్ కరోనా సంక్షోభం నుంచి తిరిగి పునరుజ్జీవనం.

ఖైరతాబాద్ గణేషుడి రూపశిల్పి రాజేంద్రన్ చిన్న పూజ అనంతరం ఈ ఏడాది విగ్రహం పని ప్రారంభించారు. విగ్రహ తయారీలో తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌తో సహా ఇతర రాష్ట్రాలకు చెందిన పలువురు హస్తకళాకారులు పాల్గొంటారు. దేశంలో మూడో దశ కరోనా వేవ్ దృష్ట్యా ఈ సంవత్సరం కూడా గణేశ్ ఉత్సవ శోభ అంత ఆడంబరంగా ఉండకపోవచ్చు.

సెప్టెంబర్ 10వ తేదీ నుంచి గణేశ్ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి శనివారం తెలిపింది. ఈ ఏడాది కొవిడ్ జాగ్రత్తలతో ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఉత్సవ సమితి జనరల్ సెక్రెటరీ భగవంత్‌రావు పేర్కొన్నారు. ఈ నెల 23న భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. ఉత్సవాలు సెప్టెంబర్ 10న ప్రారంభమై.. 19వ తేదీ ఆదివారం నిమజ్జన కార్యక్రమంతో ముగియనున్నట్లు పేర్కొన్నారు.

# సెప్టెంబర్ 10 నుంచి భాగ్యనగర్ గణేశ్ ఉత్సవాలు

హైదరాబాద్ , జులై 17: సెప్టెంబర్ 10వ తేదీ నుంచి గణేశ్ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి శనివారం తెలిపింది. ఈ ఏడాది అన్ని జాగ్రత్తలతో నిర్వహించనున్నట్లు ఉత్సవ సమితి జనరల్ సెక్రెటరీ భగవంత్‌రావు పేర్కొన్నారు. ఈ నెల 23న భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలు సెప్టెంబర్ 10న ప్రారంభమై.. 19న ఆదివారం నిమజ్జన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. గణేశ్ ఉత్సవాలకు 24 రకాల మెడిసినల్ ప్లాంట్స్ ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. నిమజ్జనం సమయానికి జీహెచ్ఎంసీ అధికారులు రోడ్లు బాగు చేయడంతో పాటు తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన కరోనా మార్గదర్శకాల మేరకు అన్ని మండపాల వద్ద అన్ని జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. మండపాలు, దేశ భక్తి, దైవ భక్తి పాటలు మాత్రమే ఉండాలని, డిస్కో పాటలు వద్దొన్నారు. ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిషేధిత గుట్కా సీజ్



రాజన్న సిరిసిల్ల, జులై 17: (నేటినిజం ప్రతినిధి): సిరిసిల్ల పట్టణంలోని బీవై నగర్‌లో నిషేధిత గుట్కా విక్రయిస్తున్నట్లు జిల్లా పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో బీవై నగర్‌లో శనివారం ఉదయం తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా రూ. 22 వేల విలువ చేసే గుట్కా ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గుట్కా విక్రయిస్తున్న అచ్చం రాజు, గంగుల రాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గుట్కా, జర్దా ప్యాకెట్లు అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఈ రెండింటిని అమ్ముతున్నారనే సమాచారం ఉంటే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం అందించే వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని పోలీసులు తెలిపారు.

# జులై 23 నుంచి తెలంగాణలో సినిమా థియేటర్లు ఓపెన్

హైదరాబాద్ , జులై 17: సినిమా ప్రియులకు శుభవార్త. గత కొద్ది నెలల నుంచి మూతబడ్డ సినిమా థియేటర్లు త్వరలోనే తెరుచుకోనున్నాయి. ఈ నెల 23వ తేదీ నుంచి సినిమా థియేటర్లను తెరవాలని తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ నిర్ణయిం చింది. ఈ మేరకు తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ప్రెసిడెంట్ మురళీమోహన్, సెక్రటరీ సునీల్ నారంగ్.. ఎగ్జిబిటర్లతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి థియేటర్ల ఓపెన్‌పై నిర్ణయం తీసుకున్నారు. సినిమా థియేటర్లలో పని చేసే సిబ్బంది ఇబ్బందులను పరిగణనలోకి తీసుకున్నామని ఫిల్మ్ ఛాంబర్ ప్రతినిధులు తెలిపారు.ఈ భేటీ కంటే ముందు సినిమాటోగ్రఫి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ప్రతినిధులు సమావేశం అయ్యారు. మంత్రిని కలిసిన వారిలో సునీల్ నారంగ్, అనుపమ్ రెడ్డి, కిశోర్ బాబు, అభిషేక్ నామా, బాల గోవిందరాజు సమావేశం అయ్యారు. థియేటర్లకు ప్రకటించిన రాయితీలపై ఉత్తర్వులు జారీ చేయాలని వారు మంత్రికి విజ్ఞప్తి చేశారు.

